క్లుప్తంగా

ఫిజియోథెరపీ క్యాంపుపై హర్షం



మోమిన్‌పేటలో చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

మోమిన్‌పేట: ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ క్యాంపును ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని ఎంఈఓ మల్లేశం పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక అవసరాల పిల్లలకు(అశ్రయ్-అక్రుతి) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పిల్లలకు ఇలాంటి సౌకర్యాలు అందడం కష్టమన్నారు. స్వచ్ఛంద సంస్థలు క్యాంపులు ఏర్పాటు చేసి చిన్నారులను అక్కున చేర్చుకోవడమేనన్నారు. అసెస్‌మెంట్ క్యాంపులో ఇద్దరు పిల్లలకు కాక్లీర్ ఇంప్లాంట్ సర్జరీకి హైదరాబాద్‌కు రెఫర్ చేశారని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేద్దాం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనందం

బంట్వారం: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేద్దామని బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనందం అన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండలంలోని బీరోల్‌లో గ్రామ కమిటీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనందం మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్మికులు

అనంతగిరి: మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ వహించాలని వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా కార్మికులు, సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రావణమాస ముగింపు ఉత్సవాలు



అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీజగద్గురు నిరంజన మఠంలో ఆదివారం నిర్వహించే శ్రావణమాస ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని వీరశైవ సమాజం సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీ బసవలింగేశ్వర స్వామి వారి శ్రావణమాస ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, పల్లకీసేవ, అనంతరం నిరంజన మఠం పీఠాధిపతులు జగద్గురు డాక్టర్ సిద్ధలింగమహాస్వామి వారి ప్రవచనాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమాలకు వీరశైవ సమాజం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సామాజిక తనిఖీకి సిద్ధం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- పనుల పరిశీలనకు వెళ్లిన ఆడిట్ బృందం
- త్వరలో నివేదికలు వెల్లడించనున్న అధికారులు

దౌల్తాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను సామాజిక తనిఖీకి సంబంధింత రికార్డులు సిద్ధం చేయడంతో పాటు ఆడిట్ బృందం శుక్రవారం నుంచి గ్రామాల్లో పనుల పరిశీలనకు వెళ్లింది. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో రూ.6.19 కోట్ల విలువైన పనులను కూలీలు, మెటీరియల్స్ చేపట్టారు.

ఇదీ పరిస్థితి

పనులు నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గ్రామల్లోని కూలీలకు పనులు కల్పించడమే ముఖ్య ఉద్దేశం. ఈ పథకంలో ఏఏ పనులు చేపట్టారు. పనులు ఎంత వరకు జరిగాయి. కూలీలకు డబ్బులు అందాయా లేదా అనే దానిపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో చెరువులు, కుంటల్లో పూడికతీత, జంగల్ కటింగ్, హరితహారంలో మొక్కలు నాటడం, వాటి పర్యవేక్షణ, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, కల్లాల నిర్మాణాలు రైతుల భూముల చదును చేయడం, చేపల పెంపకం చెరువులు, పశువుల పాకలు, వన నర్సరీల్లో మొక్కల పెంపకం, అలాగే సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు.

> **బృందాల వారీగా**
>
> హామీ పథకంలో 2024 ఏప్రిల్ నుంచి మార్చి 2025 వరకు 33 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేసేందుకు సామాజిక తనిఖీ బృందం మండలానికి వచ్చింది. పనులకు సంబంధించిన రికార్డులను అందజేశాం. గ్రామాల్లో బృందాల వారీగా తనిఖీలు చేపడుతున్నారు. గ్రామసభల అనంతరం మండల పరిషత్ సామాజిక తనిఖీ చేపట్టిన పనులను పూర్తి స్థాయిలో నివేదికను వెల్లడిస్తారు.
>
> – అంజిలయ్య, ఏపీఓ, దౌల్తాబాద్

రూ.6.19 కోట్ల పనులు

మండలంలోని 2024 ఏప్రిల్ నుంచి మార్చి 2025 వరకు రూ.6.19 కోట్ల పనులు చేపట్టారు. ఇందులో ఎంతవరకు పనులు జరిగాయి. కూలీలకు చెల్లింపులు, తదిత వాటిపై సామాజిక తనిఖీ బృదం క్షేత్ర స్థాయిలో గుర్తిస్తారు.

దంత వైద్య శిబిరం



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పూడూరు: ప్రతిఒక్కరూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొత్రేపల్లిలోని శ్రీ సాయి దంత కళాశాల పీఆర్‌ఓ రవీందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిరుతిళ్లు తినకూడదని, నిత్యం దంతాలను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సాయి దంత కళాశాల వైద్యులు రాకేష్, కావ్య, ఉపాధ్యాయులు శ్రీశైలం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత ముఖ్యం



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ నిఖిల్

అనంతగిరి: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిఖిల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జాకీర్ అహ్మద్‌తో కలిసి సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు బాగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు రాకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వార్డులలో నిత్యం శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. వార్డుల్లో ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. దోమలు నియంత్రణకై ఫాగింగ్ చేయించాలన్నారు. జ్వరం వస్తే వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, మేనేజర్ విఠల్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ వెంకటేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు ఇతర సిబ్బంది, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌తండాలో చెరువుకు గండి

- మరమ్మతులు చేపట్టిన ఇరిగేషన్ అధికారులు

తాండూరు రూరల్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని రాంపూర్‌తండా చెరువు గండి పడింది. వెంటనే తండావాసులు, రైతులు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఏఈ సాయి వెంటనే సిబ్బందితో కలిసి చెరువు వద్దకు చేరుకున్నారు. కట్టను ఇసుక బస్తాలు, వరిగడ్డి, చెట్టు కొమ్మలు, మట్టితో తాత్కాలికంగా మరమ్మతులు పూర్తి చేశారు. చెరువులోకి నీటి ప్రవాహం రావడంతో గండి ఏర్పడిందని ఏఈ తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కరం చేస్తామని హామీ ఇచ్చారు. చెరువుకు మరమ్మతులు చేయడంతో తండావాసులు, రైతులు ఊపిరిపీల్చుకున్నారు.



చెరువు కట్టకు మరమ్మతులు చేస్తున్న తండావాసులు, రైతులు

కరన్‌కోట్ జీహెచ్‌ఎంగా హేమలత



హేమలతను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు నూతనంగా జీహెచ్‌ఎంగా హేమలతను విద్యాశాఖ అధికారులు నియామించారు. గతంలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా రమేష్ బాధ్యతలు నిర్వహించారు. ప్రమోషన్‌లో భాగంగా వికారాబాద్ జిల్లాలోని మదన్‌పల్లి హైస్కూల్ నుంచి కరన్‌కోట్ పాఠశాలకు జీహెచ్‌ఎంగా హేమలత వచ్చారు. శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించడంతో పాఠశాల అధ్యాపక బృందం శాలువతో సన్మానించారు. జినుగుర్తి హెచ్‌ఎంగా విజయ్‌భాస్కర్‌రెడ్డి తాండూరు మండలం జినుగుర్తి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు జీహెచ్‌ఎంగా విజయ్‌భాస్కర్‌రెడ్డి వచ్చారు. గతంలో పని చేసిన మృత్యుంజయ స్వామి పదవీ విరమణ పొందారు. జీహెచ్‌ఎంల ప్రమోషన్‌లో భాగంగా విజయ్‌భాస్కర్‌రెడ్డి జినుగుర్తి పాఠశాలకు వచ్చారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

షాబాద్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోపిగడ్డ గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ ఖరారు చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని, అయినప్పటికీ 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవడం సిగ్గుచేటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిగౌడ్, రాజు ముదిరాజ్, ప్రశాంత్, మహేందర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

❖ బోరు మోటారు ఏర్పాటు

తాండూరు రూరల్: మండలంలోని మంబాపూర్ గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కారిస్తున్నామని కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో రెండు కొత్త బోరు మోటార్లను వార్డుల్లో బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంబాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రెండు బోరు మోటార్లను మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మైపూఫ్, నాయకులు ఇబ్రహీం, కిష్టప్ప, నర్సిములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

❖ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

దౌల్తాబాద్: గ్రామాల్లోని ప్రజలు వర్షాకాలం ఉన్నందున ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారిణి ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం నర్సాపూర్, కొడీడ్ గ్రామాల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా ఇంట్లో కూడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సంభవిస్తాయని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రఫీ, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

❖ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్: పట్టణంలో కొత్త 11కేవీ లైన్ పనుల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అర్జున్‌కుమార్, ఏఈ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఉడిమేశ్వరం, అప్పాయిపల్లి, పర్సాపూర్, మున్సిపల్ పరిధిలోని మిషన్ భగీరథ, కొడంగల్ పట్టణం, గుండ్లకుంట, పాతకొడంగల్, కొండారెడ్డిపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

❖ పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

మోమిన్‌పేట: గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం కార్మికులతోనే సాధ్యమని ఎంపీఓ యాదగిరి పేర్కొన్నారు. మండల పరిధిలోని చక్రంపల్లి గ్రామంలో పనుల జాతరలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు గ్రామాలలో చెత్త ఎక్కడ పడితే అక్కడ కన్పించడం లేదన్నారు. ప్రతి ఒక్కరు చెత్తను చెత్త బుట్టలో వేసుకొని ట్రాక్టరులో వేస్తున్నారని చెప్పారు. ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యదర్శి విక్రంరెడ్డి, నాయకులు ఉన్నారు.

తాండూరు యువతకు శుభవార్త

- అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో కోర్సులు ప్రారంభం

తాండూరు రూరల్: పట్టణంలోని యువతకు గొప్ప అవకాశం లభించిందని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ సాయన్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల సహకారంతో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి కోర్సులు ప్రారంభమవుతాయి. ఇందులో 1.ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్(సంవత్సరం కోర్సు), 2.మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్(సంవత్సరం కోర్సు), 3.ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్(సంవత్సరంకోర్సు), 4.బీడీవీవీ-పర్చువల్ ఎనాలసిస్, డిజైనర్(రెండేళ్లకోర్సు), 5.సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్(రెండేళ్లకోర్సు), 6.మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ (రెండేళ్లకోర్సు)లు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని కోర్సుల్లో కలిపి 172 సీట్లు ఉండగా ఇప్పటివరకు 28 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఎస్ఎస్‌సీ మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటో, కుల ధ్రువీకరణ పత్రం, ఇతర వివరాలను జతపర్చి ఈనెల 28వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు 84999 75115కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వైభవంగా భజన సమాప్తి వేడుకలు

- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

తాండూరు టౌన్: పట్టణం గంజ్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని భజన సమాప్తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరినీ చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. అనంతరం ఆర్ఎస్‌కే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రొంపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి, హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు, గంజ్ వ్యాపారులు, హమాలీ కార్మిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎంఏ నయీం



అబ్దుల్ రవూఫ్

తాండూరు: తాండూరు స్టోన్ మర్చంట్ వెల్ఫేర్ అసోషియేషన్, మండల క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్‌లకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్టోన్ భవన్ ప్రతినిధులు శుక్రవారం పేర్కొన్నారు. స్టోన్ మర్చంట్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడిగా ఎంఏ.నయీం(అప్పు), ఉపాధ్యక్షుడిగా ఎంఏ సత్తార్, సీ.విజయరామారావు, ప్రధాన కార్యదర్శిగా కుంచం మురళీధర్, సంయుక్త కార్యదర్శులుగా సయ్యద్ హబీబ్, బ్రిజ్ మోహన్‌బూబ్, కోశాధికారిగా సంజీవ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా మహ్మద్ అజార్‌అలీ, బస్వరాజ్, పుసల రమేష్, ఎండీ షాహీద్‌అలీ, షేక్ మహ్మద్ అలీ, మహ్మద్ అసాదుల్లా, హేమంత్‌కుమార్, మన్‌సుఖ్‌పటేల్, మహ్మద్ ముఖరముద్దీన్ అహ్మద్, మహ్మద్ బాసిత్ అలీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్వారీ ఓనర్స్ అసోషియేషన్ నూతన కమిటీ మండల క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ నూతక కమిటీ నియమించామని ఎన్నికల అధికారి బసనప్ప పేర్కొన్నారు. అధ్యక్షుడి అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులుగా ఓం ప్రకాష్‌సోమానీ, మహ్మద్ అన్వర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ జుబేర్‌పాషా, సంయుక్త కార్యదర్శులుగా జి.శరణుబస్సప్ప, కే.హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాఠశాలల్లో పరిశుభ్రత లోపం

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాను ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ప్రొద్దటూరులో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులకు రుచి లేని భోజనం పెడుతున్నారని, పాఠశాల ఆవరణలు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని లేదంటే పెద్దఎత్తున పోరాడుతామని హెచ్చరించారు.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

- ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్సింలుగౌడ్



బొంరాస్‌పేట: శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్సింలుగౌడ్, నాయకులు

బొంరాస్‌పేట: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మెంబరు నర్సింలుగౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల జాతరలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సూర్యానాయక్‌తండా, గట్టిగానితండాలో నూతన గ్రామపంచాయతీ భవనాలకు, టేకులగడ్డ తండాలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఈసీ ఇలియాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, తాలూకా డైరెక్టర్ మల్లేశం, ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి భూమి పూజ

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని తండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమి పూజ చేశారు. 2025 పనుల జాతరలో భాగంగా పనుల ప్రారంభోత్సవం, కొత్తగా చేపట్టే పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతుకుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ రాములు, స్పెషల్ ఆఫీసర్ రవికిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంత నిర్మాణం

మోమిన్‌పేట: ఇంకుడు గుంతలే భవిష్యత్ తరాలకు కీలకమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మేకవనంపల్లి, మోమిన్‌పేటలలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురిసిన ప్రతి చినుకును భూమిలోకి ఇంకిస్తేనే భవిష్యత్తు తరాలకు నీరు లభిస్తుందన్నారు. గత 40 ఏళ్ల క్రితం ఎక్కడ బావి తవ్వేన 10 మీటర్ల లోతులోనే పుష్కలంగా నీరు లభించేదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సదానందం, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ జయశంకర్, ఈసీ వికాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పనుల జాతర

దోమ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమాన్ని అధికారులు ముమ్మరంగా చేపడుతున్నారు. శుక్రవారం మండలవ్యాప్తంగా ఎంపీడీఓ గ్యామా పర్యటించి వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు. మోత్కూర్‌లో మల్లమ్మ అనే రైతు ఏర్పాటు చేసుకుంటున్న పశువుల పాక షెడ్‌ను ప్రారంభించి ప్రొసీడింగ్ అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు

దౌల్తాబాద్: ప్రభుత్వం నిర్వహించిన పనుల జాతర కార్యక్రమంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగనున్నట్లు కడా అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పనుల జాతర సందర్భంగా మండలంలోని యాంకి, దేవర్‌ఫసల్వాద్ గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, ఏఈ నాగేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా పనుల జాతర

పూడూరు: ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పూడూరు ఎంపీడీఓ పాండు తెలిపారు. శుక్రవారం ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర పండుగ ఊరూరా నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అధికారులు పాల్గొన్నారు.

మోమిన్‌కుర్దులో..

ధారూరు: మండలంలోని మోమిన్‌కుర్దు గ్రామంలో శుక్రవారం పనుల జాతరను అధికారులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామానికి మంజూరైన మినీ కోళ్ల ఫారం షెడ్డు నిర్మాణపు పనులను ఎంపీడీఓ నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఇందుకు ప్రొసీడింగ్స్ అందజేశారు.

హకీంపేట్‌లో..

దుద్యాల్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపాలన జాతర పనులు శుక్రవారం జోరుగా ప్రారంభమయ్యాయి. హకీంపేట్ గ్రామంలో తహసీల్దార్ కిషన్ పాఠశాలలో మొక్కలు నాటారు. లగచర్ల, రోటిబండతండా, నాజుఖాన్‌పల్లి, అల్లిఖాన్‌పల్లి గ్రామాల్లో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: మేకవనంపల్లిలో ఇంకుడు గుంత నిర్మాణం ప్రాంభిస్తున్న మహేందర్‌రెడ్డి



చన్గోముల్‌లో సోప్‌పిట్‌కు ముగ్గు వేస్తున్న సిబ్బంది



దుద్యాల్: మొక్కలు నాటుతున్న తహసీల్దార్ కిషన్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622